ప్రజాశక్తి
బుధవారం 10 జనవరి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

జైల్‌భరో ఉద్రిక్తం



విశాఖలో ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు



జగ్గునాయుడును అరెస్టు చేస్తున్న పోలీసులు



ఆర్‌కెఎస్‌వి.కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

300 మంది అరెస్టు

అంగన్‌వాడీ కార్మికులపై ఎపి ప్రభుత్వం ప్రయోగించిన నిరంకుశ ఎస్మా చట్టాన్ని నిలిపివేయాలని, మున్సిపల్ కార్మికులపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన మంగళవారం జైల్ భరో నిర్వహించారు. విశాఖపట్నం ఎల్‌ఐసి కార్యాలయ సమీపంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరారు. బాటా జంక్షన్ వద్ద వందలాది మంది పోలీసులు అడ్డుకొని సుమారు 300 మంది కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లాలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జైలు భరో కార్యక్రమం చేపట్టారు. అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

▶ వార్తలు 8వ పేజీలో...



దీక్షా శిబిరంలో కూర్చున్న అంగన్‌వాడీలు (ఫైల్)

అంగన్‌వాడీలపై షోకాజ్ అస్త్రం

- ఆది నుంచీ ప్రభుత్వ బెదిరింపులే
- సుప్రీంతీర్పు, వేతన హామీ అమలు నిరాకరణ
- యథాతథంగా కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అంగన్‌వాడీలపై ప్రభుత్వం బెదిరింపులు ఆపలేదు. కొద్ది రోజుల క్రితం సమ్మెపై ఎస్మా చట్టం ప్రయోగించింది. వాటికి భయపడి వెనుదిరగకుండా సమ్మెను కొనసాగించడంతో మంగళవారం నుంచి షోకాజ్ నోటీసులు జారీచేస్తోంది. కక్షగట్టి రెచ్చగొట్టే చర్యలకు దిగుతోంది తప్ప, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సంక్రాంతి పండుగకు

మిగతా 2లో..

సమ్మె కొనసాగిస్తాం



అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. షోకాజ్ నోటీసులు, బెదిరింపులకు భయపడేదిలేదు. శాంతియుతంగా పోరాడుతాం. న్యాయమైన డిమాండ్లు సాధించుకుంటాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గతంలో ఇచ్చిన హామీలను, సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలి.

ఎం.నాగేశ్వరు,
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు)
అనకాపల్లి జిల్లా కార్యదర్శి

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

▶ వార్త 2లో..

11న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

▶ వార్త 2లో..

మురికివాడల అభివృద్ధికి 40 శాతం నిధులు కేటాయించాలి

▶ వార్త 2లో..

బిల్కిస్ బానో కేసులో తీర్పుపై హర్షం

▶ వార్త 2లో..



పారిశుధ్య నిర్వహణపై అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమీక్షిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

పారిశుధ్య నిర్వహణపై మేయర్ సమీక్ష

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు, తాగునీటి విభాగపు సిబ్బంది సమ్మెలో ఉన్నందున నగరంలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు, పారిశుధ్య సేవలకు ఆటంకం కలుగుతున్న దృష్ట్యా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణపై చర్చలు జరిపి, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్ల సూచనలు, సలహాలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరుపుతోందని, అంతవరకు నగర ప్రజలకు అంతరాయం కలుగకుండా అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, పారిశుధ్య కార్మికులు నగర పరిశుభ్రతకు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.

జివిఎంసి బడ్జెట్ ఏకపక్ష ఆమోదం

- అభ్యంతరాలు, సభ్యుని సస్పెన్షన్‌తో సమావేశం రసాభాస
- మున్సిపల్, అంగన్‌వాడీ సమ్మె డిమాండ్లు పరిష్కరించాలి : సిపిఎం, సిపిఐ
- జివిఎంసి బడ్జెట్ వ్యయం రూ.5457 కోట్లు
- వివిధ పద్దుల నుంచి రెవెన్యూ రూ.4949 కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వార్షిక బడ్జెట్ జనరల్ బాడీ సమావేశం రసాభాసగా మారింది. కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అజెండాను సభలో అధిక సభ్యులైన వైసిపి కార్పొరేటర్లు ఏకపక్షంగా ఆమోదించారు. తొలుత బడ్జెట్ ప్రసంగాన్ని మేయర్ గొలగాని హరివెంకటకుమారి చదివారు. తెలుగుదేశం, జనసేన, సిపిఎం, సిపిఐ కార్పొరేటర్ల అభ్యంతరాలను సైతం

మిగతా 2లో..



మేయర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, టిడిపి, జనసేన కార్పొరేటర్లు

మొదటి పేజీ తరువాయి..

అంగన్‌వాడీలపై 'షోకాజ్' అస్త్రం

అంగన్‌వాడీలకు కానుకగా ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లులేదు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకులకు షోకాజ్ నోటీసులు జారీచేసి, వాటిని అందుకున్న పది రోజుల్లోపు సంజాయిషీ నోటీసు ఇవ్వకపోతే, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొంది. సమ్మెకు దిగిన ప్రారంభ రోజు నుంచి భయపెట్టడమే ప్రభుత్వం ఆయుధంగా ఎంచుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను కొన్ని చోట్ల బద్దలుగొట్టించి తెరిపించింది. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో నడిపించాలని ప్రయత్నించింది. అయినా అంగన్‌వాడీలు భయపడకుండా తమ సమ్మెను ఐక్యంగా కొనసాగిస్తున్నారు. కేంద్రాలను బలవంతంగా తెరిపించడంపై స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ ఆలోచన నుంచి వెనక్కుతగ్గింది.

విధులకు హాజరుకాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్లతో ప్రకటన జారీచేయించింది. తరువాత ఎస్మా చట్టం ప్రయోగించి, సమ్మెపై నిషేధం విధించినా అంగన్‌వాడీలు యథాతథంగా సమ్మెను శక్తివంతంగా కొనసాగిస్తున్నారు. శాంతియుతంగా వివిధ రూపాల్లో తమ నిరసన తెలియజేస్తున్నారు. ఇది భరించలేని ప్రభుత్వం షోకాజ్ నోటీసుల అస్త్రం ప్రయోగించింది. 90 మంది కార్యకర్తలు, సహాయకులకు ఐసిడిఎస్ అధికారులు నోటీసులు జారీచేశారు. నక్కపల్లి ప్రాజెక్టులోని నామవరం-1 అంగన్‌వాడీ కార్యకర్తను విధుల్లో చేరకపోతే సూపర్‌వైజర్ ప్రమోషన్ రాదని బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారు. నోటీసులు తీసుకోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు రిజిస్టర్ పోస్టులో పంపిస్తున్నారు. జిల్లాలోని 1725 మెయిన్, 183 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 3,529 మంది కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె కొనసాగిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వేతనం, పెరుగుతున్న ధరలకు తగినట్లు పిల్లల మెనూ ఛార్జీలు పెంచాలని, 2017 నుంచి ప్రాజెక్టు సమావేశాలకు తమ వేతనాల నుంచి పెడుతున్న టిఎ, డిఎల బకాయిలు చెల్లించాలని, ఇలా పలు న్యాయమైన, ఆమోదయోగ్యమైన డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు మద్దతు లభిస్తోంది. ప్రభుత్వం ఎంత భయపెట్టినా అంగన్‌వాడీల్లో ఆత్మస్థైర్యం ఏ మాత్రమూ తగ్గలేదు. డిమాండ్లు సాధించుకొనే వరకు పోరాడుతామన్న పట్టుదల క్రమంగా పెరుగుతోంది.

జివిఎంసి బడ్జెట్ ఏకపక్ష ఆమోదం

పట్టించుకోకుండా సమావేశం అధ్యక్షులు మేయర్ తన బడ్జెట్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ సభలో ఆమోదానికి పెట్టి అయ్యిందనిపించారు. బడ్జెట్ సమావేశం ఆరంభంలోనే సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, స్టాలిన్ తాము తీసుకొచ్చిన 'మున్సిపల్, అంగన్‌వాడీ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని, సమ్మె విరమింపజేయాలని తెలిపే నినాదాల ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలిపారు. పోడియం వద్దకు వెళ్లి ఈ సమస్యపై చర్చించాలని గంగారావు డిమాండ్ చేశారు. దీంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం, మంత్రులు వారితో చర్చలు సంప్రదింపులు చేస్తున్నారని సమస్య పరిష్కారానికే కృషిచేస్తున్నారని చెప్పారు. ఈ సమస్యలపై అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశంలో దీనిపై ఒక స్పష్టత వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ వార్డుల పరిధిలో ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామో సభ్యులకు తెలియజేయాలని పలువురు వైసిపి, టిడిపి కార్పొరేటర్లు పట్టుపట్టారు. కానీ వివరాలను అధికారులు వెల్లడించలేదు. తర్వాత సమాచారం ఇస్తామని దాటవేశారు. 2024-25 బడ్జెట్ రెవెన్యూ రూ.4949 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వ్యయం రూ.5457కోట్లుగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇది అంకెల గారడీ తప్ప అభివృద్ధికి దోహదపడదని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఎద్దేవాచేశారు. జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు మేయర్ ప్రసంగానికి, సభకూ అడ్డుతగులుతూ పోడియం వద్దకు వెళ్లి మేయర్‌తో పలు సమస్యలపై వాగ్వావాదానికి దిగారు. మేయర్ రూలింగ్ ఇస్తూ నాగరాజును సభ నుంచి సస్పెండ్ చేస్తూ ప్రకటించారు. జనసేన కార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, గోవింద్, అనంతలక్ష్మి ఆయనకు మద్దతుగా నిలిచి నినాదాలు చేశారు.

వార్డుల అభివృద్ధికి రూ.5కోట్లు ఇవ్వాలి: టిడిపి

వార్డులకు రూ.2కోట్లు అభివృద్ధి కోసం ఇస్తున్నట్లు మేయర్ హరికుమారి వెల్లడించగా రూ.5కోట్లు ఇవ్వాలని లేదంటే ఈ బడ్జెట్‌ను తాము తిరస్కరిస్తున్నామని టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సభ నుంచి తమ కార్పొరేటర్లతో వాకౌట్ చేశారు.

ఆడిట్ అభ్యంతరాలపై గరం గరం...

2019 తర్వాత నగరపాలక సంస్థ పాలక వర్గం ఏర్పాటైన నుంచి నేటివరకూ జివిఎంసి చేపట్టిన సుమారు రూ.77కోట్ల విలువైన పనుల్లో ఆడిట్ అభ్యంతరాలున్నాయని టిడిపి కార్పొరేటర్ రాపర్తి కన్నా బడ్జెట్ సమావేశంలో లెక్కలు, ఆధారాలతో అసెస్మెంట్ల వివరాలతో కౌన్సిల్‌లో వెల్లడించారు. ఖాళీ స్థలాల పన్ను వసూళ్లలోనూ, పట్టణ ప్రణాళికా విభాగంలో అక్రమ అంతస్తుల నిర్మాణాలపై ఆడిట్ అభ్యంతరాలపై ప్రశ్నించారు. అదనపు కమిషనర్ వర్మ మాట్లాడుతూ ఆడిట్ అభ్యంతరాలపై స్పెషల్ టీమ్స్ డ్రైవ్ చేస్తున్నాయని వెల్లడించారు. ఈ సమాధానంతో రాపర్తి, మిగతా సభ్యులు సంతృప్తి చెందలేదు. చాలా మంది వైసిపి, టిడిపి కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశానికి డుమ్మా కొట్టారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ యాదవ్ హాజరయ్యారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ సమావేశం ప్రారంభమైన తర్వాత వేరే పని ఉందని తెలియజేస్తూ బయటకు వెళ్లిపోయారు.

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజల ఆస్తులకు భద్రత లేని, ప్రజా వ్యతిరేక ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ (భూమి యాజమాన్య హక్కుల చట్టం- 2023)ను రద్దు చేయాలని నెల రోజులుగా విశాఖపట్నం న్యాయవాదులు చేపడుతున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంతవరకు ఈ ఉద్యమానికి ఐక్యత, సంఘీభావం తెలిపిన ప్రజా సంఘాలకు, రాజకీయ పార్టీలకు, ఉద్యమకారులకు, సామాజిక కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్న నేపథ్యంలో అందరూ క్రియాశీలకంగా, ఉద్యమ పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో పాల్గొనాలని, ముఖ్యంగా ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా న్యాయవాదుల జాయింట్ ఏక్షన్ కమిటీని ఏర్పాటు చేశామని, దీనికి సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణను కన్వీనర్‌గా, మరో 60 మంది సభ్యుల పర్యవేక్షణలో చురుకుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ధర్నాలు, రాస్తారోకోలు, కోర్టు నిర్బంధాలు, ర్యాలీలు, బహిరంగ సభల ద్వారా ఈ చట్టం దుష్పరిణామాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ ప్రజా వ్యతిరేక చట్టంతో ప్రజల భూమి, ఆస్తుల హక్కులను లాక్కోవడానికి ప్రభుత్వ వ్యవస్థ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలే సారథులుగా ప్రతిఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బిఎస్.లత, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బెవరా సత్యనారాయణ, ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి.రామాంజనేయులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మురికివాడల అభివృద్ధికి 40 శాతం నిధులు కేటాయించాలి


మహాధర్నాలో పాల్గొన్న మురికివాడల నివాసులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మురికివాడల అభివృద్ధికి, సంక్షేమానికి మున్సిపల్ బడ్జెట్‌లో 40 శాతం నిధులు కేటాయించాలని, నివాస హక్కును ప్రాథమిక హక్కుగా రాజ్యాంగ చట్టంలో చేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. నివాస హక్కుల పోరాట దినం(జనవరి 9) సందర్భంగా మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది గిరిధర్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, లీడర్ సంపాదకుడు వివి.రమణమూర్తి, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కె.రవికుమార్, దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, బుద్దిస్ట్ నటరాజ్, విద్యా పరిరక్షణ కమిటీ నాయకుడు కిషోర్, డిటిఎఫ్ నగర అధ్యక్షుడు ధర్మేంద్రరెడ్డి తదితరులు మాట్లాడుతూ, జివిఎంసి పరిధిలో ఉన్న మురికివాడలను సమగ్రంగా అభివృద్ధి చేయాలంటే, ఇప్పటికే ఉన్న మున్సిపల్ చట్టాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎపి స్లమ్ ఇంప్రూవ్మెంట్ యాక్ట్ 1956 ప్రకారం జివిఎంసి పరిధిలోని మురికివాడలన్నింటినీ నోటిఫై చేయాల్సి ఉందన్నారు. తదనంతరం అదే చట్టాన్ని ఉపయోగించి అక్కడే ఇళ్ల నిర్మాణం చేపట్టి, విద్య, వైద్యము కమ్యూనిటీ హాలు తదితర సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత జివిఎంసిపై ఉందన్నారు. ఒకవేళ స్లమ్స్ ఉన్న స్థలం ప్రైవేట్ వ్యక్తులదయినట్లయితే, భూ సేకరణ చట్టం ప్రకారం తగిన పరిహారం చెల్లించి జివిఎంసి ఆ భూమిని సేకరించాల్సి ఉంటుందన్నారు. కానీ జివిఎంసి అధికారులు ఇవేమీ చేయడంలేదన్నారు. చట్టవిరుద్ధంగా మురికివాడలను తొలగింపు, తరలింపులను చేసి బడా బాబులకు వాటిని కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పేద మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీల మహిళల ఆస్తి హక్కులను కాలరాసే ఎపి టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో అర్బన్ సీలింగ్ యాక్ట్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ కూడా జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేయాలన్నారు.

11న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు గురువారం చైర్ పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.పోలినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. అధికారులందరూ తమ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

బిల్కిస్ బానో కేసులో తీర్పుపై హర్షం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఎంవిపి కాలనీ : బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల శిక్ష కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆవాజ్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

విశాఖ కలెక్టరేట్ : బిల్కిస్ బానో అత్యాచార కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానిస్తున్నామని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ అన్నారు. ఈ తీర్పు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. అనురాధ, జహారా, రాంప్రభు, ఐఎం.అహమ్మద్ పాల్గొన్నారు.

ప్రపంచ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు డివిఎస్‌వై శర్మ ఎంపిక



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గోవాలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు విశాఖపట్నం ఎల్ఐసి ఉద్యోగి డివిఎస్‌వై శర్మ ఎంపికైనట్లు ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలే ఆయన బ్లూ బడ్జ ఎంపైర్‌గా ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ సంఘం సభ్యులు ఆయనను అభినందించారు.

యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో 'ఓం ఫ్రీ యోగా'కు చోటు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతి రోజు ఎంతో మందికి యోగా శిక్షణను ఉచితంగా అందజేస్తున్న ఓం ఫ్రీ యోగా సంస్థ సభ్యులు యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సాధించారు. విశాఖ బీచ్ రోడ్డులోని గాది రాజు ప్యాలెస్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో 270 మంది రెండు విభాగాల్లో 216, 108 రౌండ్లలో నిరంతరాయంగా సూర్య నమస్కారాలు చేసి వరల్డ్ రికార్డు నమోదు చేశారు. 88 నిమిషాల్లో 2592 సూర్య నమస్కారాలను పూర్తి చేసినందుకు యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ వీరు స్థానం సంపాదించారని, 108 రౌండ్ లను 44 నిమిషాల్లో, 216 రౌండ్లను 88 నిమిషాల్లో పూర్తి చేసినట్లు యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి శిఖాదర్బారి, ఇంటర్నేషనల్ కోచ్ డాక్టర్ సయ్యిద్ రఫీ, యోగాసన వరల్డ్ రికార్డ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.పరాసర్, చీఫ్ ఎడిటర్ మల్విజ వాజ్పేయి, సెబి సిఐ కల్యాణి, ఓం యోగ సెంటర్ ప్రెసిడెంట్ శాంతారామ్, బిజెపి నాయకులు కాశీ విశ్వనాథ్, రవీందర్ రెడ్డి, గురూజీ విష్ణుచితా, ఎం సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం ఓం ఫ్రీ యోగ సంస్థ సభ్యులు వెన్నెల రామలక్ష్మి మంగళవారం జరిగిన 216 సూర్య నమస్కారాలు పాల్గొని యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో స్థానం సాధిచారు. ఓం ఫ్రీ యోగ సంస్థ వ్యవస్థాపకులు చిలక వెంకట రమేష్ అవార్డు ప్రదానం చేసారు.

గడువులోగా ఇళ్ళ నిర్మాణాల పూర్తి

భీమిలి మండలసభలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో మంజూరైన ఇళ్ళ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్త శెట్టి శ్రీనివాసరావు గృహనిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దంతులూరి వెంకట శివసూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పంచాయతీల వారీగా మంజూరైన ఇళ్లు, వాటిల్లో ఎన్ని పూర్తయ్యాయి? మిగిలిన వాటి పురోగతిపై హౌసింగ్ ఎఇ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. 2,163 ఇళ్లు మంజూరు కాగా, 805 ఇళ్ళ నిర్మాణం పూర్తయిందని ఎఇ వివరించారు.అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో స్థానికుల భాగస్వామ్యం పెంచాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, ఎఎంసి ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ,ఎంపిడిఒ డాక్టర్ వి జానకి, తహసీల్దార్ సిహెచ్‌వి రమేష్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నాం

మండల సర్వసభ సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిల ఆవేదన



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఆనందపురం : సమస్యలను పరిష్కరించలేక, అభివృద్ధి పనులు జరగక ఓట్లేసి గెలిపించిన ప్రజలకు గ్రామాల్లో ముఖం చూపించలేకపోతున్నామని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శారదా ప్రియాంక అధ్యక్షతన జరిగిన మండల సభకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముందు తమ గోడు, ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. మరో రెండు మూడునెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజల్లోకి ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. బీపీ కల్లాలులో 800 మీటర్ల రోడ్డు పనులు చేయకుండా గాలికొదిలేశారని, అంగన్వాడీ, పాఠశాల భవనాలు ఊసే లేదని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదని పంచాయతీల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారని సర్పంచ్ కోన పైడిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వేములవలసలో జగనన్న ఇల్లు మంజూరు కాలేదని, ఆనందపురం పంచాయతీ లోడగలవానిపాలెంలో రోడ్లు, అలుగులులో కాలువలు అధ్వానంగా ఉన్నా నిధులు లేమితో పనులు చేపట్టలేకపోతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. తూతూమంత్రంగా సమావేశాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోగానైనా కొన్ని సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. సమావేశంలో ఎంపిడిఒ అడపా లవరాజు, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపిపిలు పాండ్రంకి.శ్రీను, ధనలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, ఎఎంసి ఛైర్మన్ సూర్యనారాయణ, వైస్ ఛైర్మన్ అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లవరాజును ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఇతర ప్రజాప్రతినిధులు సత్కరించారు.

ధాన్యం కొనుగోళ్లలో సగం లక్ష్యం పూర్తి



తాటితూరులో ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - భీమునిపట్నం : భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 32,881 క్వింటాళు ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 60 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోని, గతనెల 4నుంచి కొనుగోళ్ల ప్రారంభించగా, ఇప్పటికి సగం లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు.

మండలాల వారీగా భీమిలి మండలంలో తాటితూరు, దాకమర్రి ఆర్‌బికెల ద్వారా 3,181 క్వింటాళ్ళు, ఆనందపురం మండలం, బోని ఆర్‌బికె ద్వారా 4,400 క్వింటా ళ్ళు, పద్మనాభం మండలం పద్మనాభం, బాందేవుపురం, గంధవరం, కృష్ణాపురం, పొట్నూరు, పాండ్రంగిఆర్‌బికెల ద్వారా 25,300 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. పౌర సరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటా రూ 2,203 లు, సాధారణ రకం ధర రూ 2,183లకు ధాన్యం కొనుగోలు చేపట్టారు. ఈ ఏడాది ఎకరాకు సగటున28 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం ఉన్నత పాఠశాల నుండి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మంగళవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాల ప్రెసిడెన్షియల్ గెజిట్‌ను త్వరగా పాస్ చేయడం, ప్రమోషను ప్రక్రియ వేగవంతం చేయడం ద్వారా ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులను ఆగస్టులోగా తిరిగి సొంత జిల్లాలకు పంపేలా కృషి చేస్తానన్నారు. పిఆర్‌టియునేతలు గోపీనాథ్, శివశంకర్‌నాయుడు ఏజెన్సీ టీచర్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

తర్లువాడలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని తర్లువాడలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక ప్రారంభించిన వైద్యశిబిరంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షేక్ షెహనాజ్, వైద్యసిబ్బంది సేవలు అందించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ పి.కోటేశ్వర రావు వైద్యశిబిరాన్ని సందర్శించారు. సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌మజ్జి వెంకటరావు,సెక్రటరీ సురేష్, సూర్యాదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయిలో 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి -పద్మనాభం.: ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలు బుధవారం నుంచి మండల స్థాయిలో నాలుగు ప్రాంతాల్లో నిర్వహిస్తామని ఎంపిడిఒ కె.ప్రభాకరరావు తెలిపారు. గ్రామస్థాయిలో ఆట పోటీల్లో విజేతలుగా నిలిచిన వారితో పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్, కస్తూర్బా పాఠశాల, స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికలుగా మండలస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంపిపి కె.రాంబాబు ప్రారంభిస్తారన్నారు.

జనభాగీదారీని జయప్రదం చేయండి



రక్తదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

ప్రజాశక్తి-సీతమ్మధార : అంబేద్కర్ భావజాలాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్. విశ్వనాథన్ అన్నారు. ఈ నెల 19న అమరావతిలో అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణలను పురస్కరించుకొని జనభాగీధారి పేరిటి రామాటాకీస్ దరి అంబేద్కర్ భవన్ వరకు నిర్వహించిన చైతన్య ర్యాలీని మంగళవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి జిల్లా స్థాయి అధికారులు, అంబేద్కర్ అసోసియేషన్ ప్రతినిధులు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తొలి రక్తదానం చేసి అందరిలో స్ఫూర్తి నింపారు. డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, డిపిఒ శ్రీనివాసరావు, ఇతర అధికారులు రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిపికెట్లు అందజేశారు. జనభాగీధారి పేరిట నిర్వహించే చైతన్య కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యం కావాలని, ఈ నెల 18న ముగింపు ఉత్సవం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిఆర్ఒ కె. మోహన్‌కుమార్, డిఇఒ చంద్రకళ, యుసిడి పీడీ పాపునాయుడు, బిసి వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, జివిఎంసి జేడీ శ్రీనివాసరావు, డిఎల్‌డిఒ పూర్ణిమాదేవి, కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సీతమ్మధార : ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణలోపాల్గొని విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యలయంలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, వావిలపల్లి ప్రసాద్, కెవిఎన్ శశికళ, రాష్ట్ర నాయకులు కిరణ్ రాజు,పేడాడ రమణికుమారి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు

సంతకాల సేకరణ

గొలుగొండ: విజయవాడలో 125 అడగుల భారీ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణను పురస్కరించుకుని మండలంలోని జోగుంపేటలో సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జక్కు నాగమణి, వైసిపి అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామినాయుడు, సర్పంచ్ జువ్వల లక్ష్మీ, అనిమిరెడ్డి తాతయ్య, వేమల సత్యనారాయణ, కుపరాల నరసింగరావు, దేముడు, అప్పారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

'మేఘాద్రి'లో పడి యువకుడు మృతి



మృతుడు శివ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- పెందుర్తి : మేఘాద్రి రిజర్వాయర్‌లో పడి సత్తివానిపాలేనికి చెందిన యువకుడు పడి శివ(30) మంగళవారం మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాలివి. ఆరు నెలల క్రితమే వివాహం చేసుకున్న శివ, ఎప్పటిలాగానే మంగళవారం ఉదయం డ్యూటీకి వెళ్ళాడు మధ్యాహ్నం అనుమతి తీసుకుని ఇంటికి వచ్చాడు. పని ఉందని ఇంటిలో చెప్పి బయటికి వెళ్లిన శివ ఇలా మేఘాద్రి రిజర్వాయరులో శవమై తేలాడని మృతుని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అందిన సమాచారం మేరకు సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ రిజర్వాయర్ శివార్లలో నాటుసారా తయారీ స్థావరాలపై దేవరాపల్లి పోలీసులు మంగళవారం దాడి చేసి 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై డి.నాగేంద్ర తన సిబ్బందితో కలిసి నాటుసారా శిబిరాలపై దాడి చేశారు. అనంతగిరి మండలం జీనబాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని పట్టుకున్నారు. ఈ స్థలంలో 4000 లీటర్ల బెల్లం పులుపును కూడా ధ్వంసం చేశారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు.

నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్: మండలంలోని గుర్రందొరపాలెం గ్రామ శివారులో నాటుసారా తయారీ కేంద్రాలపై నర్సీపట్నం రూరల్ ఎస్ఐ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీకి ఉపయోగించే 800 లీటర్ల బెల్లంపులుపు ధ్వంసం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ, సారా నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

వరి కుప్పలు, పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని రత్నంపేటలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పది వరి కుప్పలు, ఒక పశువుల పాక దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి వరికుప్పలతోపాటు పాక కాలి బూడిదైంది. ఆరుగాలం కష్టపడి చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

18వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జోన్-1 పరిధిలోని అన్ని పాఠశాలలకు మంగళవారం నుంచి ఈనెల18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్టు పాఠశాల విద్య, జోన్ 1 ప్రాంతీయ సంచాలకులు ఎం.జ్యోతి తెలిపారు. విద్యా కేలండర్‌ను అనుసరించి అన్ని పాఠశాలలు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని, నిబంధనలకు అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.

రాకేష్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ పర్యటనలో ఉన్న . ఉత్తరాంధ్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పి.రాకేష్‌రెడ్డిని గాజువాక సమన్వయ కర్త జెర్రిపోతుల ముత్యాలు, పశ్చిమ సమన్వయకర్త అంగావర్మ, 64వ వార్డు పార్టీ అధ్యక్షులు యరబాల భూలోక, గాజువాక ఎస్‌సి సెల్ నాయకులు ములకలపల్లి రాజుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించారు..



ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జితో కాంగ్రెస్ నేతలు

ఐదో వార్డు సమస్యలపై వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ హేమలత.

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదో వార్డు అభివృద్ధికి సహకరించాలని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారిని స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. మంగళవారం జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు సమస్యలతో వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో ఆక్రమణలకు గురౌతున్న సర్వే నెంబర్ 61లోని బొట్టవానిపాలెం వెంపలచెరువు, సర్వే నెంబర్ 65లోని నగరంపాలెం రాళ్ల చెరువులను పునరుద్ధరించి, గతంలా తాగు,సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాజీవ్‌గృహకల్ప, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలలో యూజీడి సమస్యకు శాశ్వత పరిష్కారం, వికలాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, స్వయంకృషి నగర్ తదితర కొండవాలు ప్రాంతాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు, పైపులైన్లఏర్పాటు, మారికవలస నుండి ఓజోన్ వ్యాలీ కాలనీకి వెళ్లే రహదారి అభివృద్ధి, అయోధ్యనగర్ కాలనీకి మౌలిక వసతులు కల్పన, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడ, మెట్ల మార్గాలు నిర్మాణం వంటి పనులు చేపట్టాలని కోరారు. టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు ఉన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి జెడి.శీలం

ప్రజాశక్తి- సీతమ్మధార : కాంగ్రెస్ పార్టీ పూర్వం వైభవం తెచ్చేందుకు పార్టీకేడర్ సమిష్టిగా కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం అన్నారు మంగళవారం పౌరగ్రంథాలయంలో ఉత్తరాంధ్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాస్థాయి నాయకులు నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయిలో విస్తృతంగా పర్యటించి నాయకత్వం పటిష్టం చేసేందుకు, పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించేలా ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాల న్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎపికి ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరంగా కాకుండా చూడడం వంటి పనులు చేపడతామని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస: జివిఎంసి ఒకటో వార్డు సంతపేటలో తెలుగు యువత వార్డు అధ్యక్షులు గరే సదానంద ఆధ్వర్యాన మంగళ వారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.సదానందతోపాటు తెలుగు యువత కార్యదర్శి డి వెంకటేష్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు సుబ్బారావు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు

డివైడర్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : డివైడర్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం లేకుండా తగిన జాగ్రత్తలు వహించాలని ఎఇ రమణమ్మ సూచించారు. మంగళవారం అక్కయ్యపాలెం నగల మహారాణి పార్లర్ వద్ద డివైడర్ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల మేరకు నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వర్క్ ఇన్స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, రవి పాల్గొన్నారు.



డివైడర్ పనులను పర్య వేక్షిస్తున్న ఎఇ రమణమ్మ

15వ రోజుకు మున్సిపల్ సమ్మె

◆ చెత్త తరలింపు వాహనాల అడ్డగింత ◆ భిక్షాటనతో కార్మికుల నిరసన



చెత్త తరలింపు వాహనాల ముందు నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -మధురవాడ : తమ సమస్యల పరిష్కారానికి 15రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు మంగళవారం 5,7 వార్డుల పరిధిలోని పలు కాలనీల్లో నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. కారుషెడ్, వాంబే కాలనీ, వుడా కాలనీ తదితర ప్రాంతాలలో చెత్త సేకరణ వాహనాలు, పోటీ కార్మికులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కె.నాగరాజు, డి సూరిబాబు, మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం మొండివైఖరి మానుకోవాలని కోరారు. కార్మికులపై నిర్బంధాన్ని ఆపాలని, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూని యన్ నాయకులు కె.అర్జునమ్మ, పి జాన్, బి నర్సింగరావు, కె.శుభ, కె.దేవుడు, ఉమా, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాలు అడ్డగింత

అనకాపల్లి : మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం ముందు 15వ రోజు ఆందోళన కొనసాగించారు. ఈ సమయంలో మున్సిపల్ అధికారులు ప్రైవేటు ట్రాక్టర్లతో చెత్తను తరలించే ప్రయత్నిం చేయగాన కార్మికులు ఆ వాహనాలను అడ్డగించారు. మున్సిపాలిటీ వాహనాలు ఉండగా ప్రైవేటు వాహనాలు పెట్టాల్సిన అవసరం ఏమి వచ్చిందని అధికారులను నిలదీశారు. ప్రైవేటు వాహనాలను వెనక్కు పంపారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసనగా మంగళవారం కార్మికులు రోడ్లపై భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, యూనియన్ నేతలు జి.సత్యనారాయణ, బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్ కుమార్, నూకరాజు, శివ కుమార్, సంతోష్, గణేష్, శ్రీను, లక్ష్మణరావు పాల్గొన్నారు.

9వ రోజు వాటర్ ఫిల్టరేషన్ వర్కర్ల నిరసన

విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ వర్కర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం నాటికి 9వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, కార్యదర్శి డి.శేఖర్, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌కు చెందిన ఎస్.శంకర్‌రెడ్డి, పి.సతీష్, ఆర్.సత్యం పాల్గొన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని, సమాన పనికి సమానవేతనం, రూ.26 వేలు కనీస వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

నైపుణ్యాభివృద్ధితో సామాజిక సేవ



ఇటలీ వైద్య నిపుణుడిని అభినందిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి- విశాఖపట్నం :వైద్యులు నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరచుకుని, సమాజసేవలో పునరంకితం కావాలని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. మంగలవారం గీతం దంత వైద్య కళాశాల,ఆసుపత్రి, ఇండియన్ డెంటల్ అసోసియేషన్, విశాఖశాఖ సంయుక్త ఆధ్వర్యాన దంతవైద్యంలో నూతన విధానాలపై ప్రత్యేక సదస్సున నిర్వహించారు. నిరంతర విద్యావిధానంలో భాగంగా నిర్వహించిన సదస్సులో ఇటలీకి చెందిన ప్రఖ్యాత దంత వైద్య నిపుణుడు డాక్టర్ గియోవన్ని కావల్లీ పాల్గొని, క్షీణించిన దంతాలను చికిత్స ద్వారా ఏవిధంగా సరిచేయవచ్చో వివరించారు. గీతం దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. సీతారామరాజు అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో ఐడిఎ విశాఖశాఖ అధ్యక్షుడు డాక్టర్ కందర్ప శ్రీనివాస్, గీతం కన్సర్వేటివ్ డెంటిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ కె.శిరీష పాల్గొన్నారు.

యుటిఎఫ్ నేతల నిర్బంధం అన్యాయం

ప్రజాశక్తి -గాజువాక: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ పిలుపునిచ్చిన విజయవాడ ధర్నా చౌక్ నిరసనను భగ్నం చేసి, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎస్ఎస్. ప్రసాద్, నక్క వెంకటేశ్వర్లులతోపాటు వందలాది యుటిఎఫ్ కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించి స్టేషన్‌కు తరలించడం అక్రమమని ఫెడరేషన్ గాజువాక మండల ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకొన్న ఎపిజిఎల్ఐ, జెడ్‌పిపిఎఫ్, ఇఎల్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ సొమ్ములు కోసం యుటిఎఫ్ 36 గంటల పోరుబాటకు తరలివచ్చే నేతలను ఎక్కడికక్కడే జిల్లాల్లో నిర్బంధించి, అరెస్ట్ చేయడమే కాకుండా, విజయవాడలోనూ భగ్నం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాల ఇవ్వాలన్న డిమాండ్‌ను నెరవేర్చలేకపోవడం దుర్మార్గమన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి - ఆనందపురం : మండలం లోని వెల్లంకి, దొరతోట ఎస్‌సి కాలనీలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ, వైద్యానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న భవిరిశెట్టి వెంకటరావుకు అనకాపల్లి జిల్లాకు చెందిన స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు రూ.పదివేలు ఆర్థికసాయం అందించారు. బాధితునికి కిడ్నీ దానం చేసేందుకు తన తల్లి ముందుకు వచ్చినా ఆపరేషన్‌కు రూ.12లక్షల వరకు ఖర్చవుతుందని, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆదుకోవాలని స్నేహాంజలి ఆర్గనైజేషన్ సభ్యుడు భోగేష్ అన్నారు. ఒఎస్‌జి ఫౌండేషన్ ప్రతినిధులు శివ దళాయి, ఎర్రంశెట్టి సంతోష్ పాల్గొన్నారు

సెలవుల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు ఈ నెల 9 నుండి 18 వరకు, జూనియర్ కళాశాలలు ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు విధిగా అమలు చేయాలని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతుల పేరిట విద్యాసంస్థలను తెరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులకు, ఇంటర్మీడియట్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. సంక్రాంతి సెలవులునిబంధనలు అతిక్రమిస్తే ఆయా విద్యాసంస్థల గుర్తింపు రద్దుతోపాటు క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేయక తప్పదని హెచ్చరించారు. apscpcr2018@gmail.com మెయిల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ఉర్రూతలూగించిన యువభేరి

▸▸ ఎయులో ఘనంగా ముగిసిన సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ యూత్ ఫెస్టివల్

▸▸ ఓవరాల్ ఛాంపియన్‌గా కొట్టయాం మహాత్మాగాంధీ యూనివర్సిటీ



యువభేరిలో గెలుచుకున్న బహుమతులతో విద్యార్థుల కేరింతలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఎయు వేదికగా ఐదురోజులుగా నిర్వహించిన 37వ సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ యూత్ ఫెస్టివల్ ఘనంగా ముగిసింది. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లుతో దేశంలోని వివిధ యూనివర్సిటీల విద్యార్థులు యువభేరి సదస్సును ఉర్రూతలూగించారు. యూత్ ఫెస్టివల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా కొట్టయాం మహాత్మగాంధీ యూనివర్సిటీ నిలిచింది. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్‌సెంటర్‌లో ముగింపు వేడుకల్లో ఎయు ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.సమత మాట్లాడుతూ విద్యార్థులు సమగ్ర వికాసానికి, ప్రగతికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని,విద్యార్థులు భావనైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. సానుకూల దృక్పథం, సృజనాత్మకంగా పనిచేయడం, ఆవిష్కరణలు చేసే తత్వం, సమిష్టిగా పనిచేయడం అలవరచుకోవాలని యువతకు సూచించారు. విజయం సాధించడం కంటే పోటీలో నిలవడం ఎంతో ప్రధానమన్నారు. ఎఐయు అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర మాట్లాడుతూ యువభేరి పేరును సార్థకం చేసే విధంగా ఎయు కార్యక్రమాలను నిర్వహించిందని అభినందించారు. యువభేరిలో ప్రదర్శనలిచ్చిన 10 మంది యువతకు బాలీవుడ్‌లో పాడే అవకాశాలు లభించాయన్నారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్,ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్, కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు పాల్గొన్నారు.



యూత్‌ఫెస్టివల్‌లో సాంస్కృతిక ప్రదర్శన

కేరళ వర్సిటీల హవా

సౌత్ జోన్ కల్చరల్ ఫెస్ట్ ఓవరాల్ చాంప్‌గా మహాత్మ గాంధీ యూనివర్సిటీ (కొట్టయాం) నిలచింది. రెండవ స్థానంలో యూనివర్సిటీ ఆఫ్ కేరళ, మూడవ స్థానంలో శ్రీ శంకరాచార్య యూనివర్సిటీ, నాల్గవ స్థానంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ, ఐదవ స్థానంలో కొచ్చిన్ యూని వర్సిటీలు నిలచాయి.క్రీడాంశాలు, విభాగాల వారీగా విజేత లకు విసి ఆచార్య సమత బహుమతులు అందజేశారు. యువభేరిలో ఏర్పాట్లుపై ప్రశంసలు వచ్చాయి.

అబ్బురపరిచి, ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

చివరిరోజున వేదికపై యూనివర్సిటీ ఆఫ్ కేరళ విద్యార్థుల శబ్ధ, స్వర శక్తిని చాటుతూ సాంప్రదాయ వాద్యాలతో చేసిన స్వర విన్యాసం, కె.ఎల్ యూనివర్సిటీ విద్యార్థులు గిటార్, వీణ, డ్రమ్స్‌తో చేసిన జుగల్బందీ, ఎంజి యూనివర్సిటీ, కేరళ యూనివర్సిటీ, శంకరాచార్య యూనివర్సిటీ విద్యార్థుల శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీలు అలరించాయి.

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన సమగ్ర శిక్ష ఉద్యోగి మృతి

- ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన
- రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, రూ.2 లక్షలు తక్షణ సాయానికి అంగీకారం

ప్రజాశక్తి- అనకాపల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా అనకాపల్లి డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేసే క్రమంలో డిసెంబర్ 23వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన సమగ్ర శిక్ష ఉద్యోగి జడ్డు వాసుదేవరావు (34) మంగళవారం మృతి చెందారు. దీంతో వాసుదేవరావు మృతదేహాన్ని సమగ్ర శిక్ష ఉద్యోగులంతా ప్రదర్శనగా అనకాపల్లి నుంచి డీఈఓ కార్యాలయం వద్దకు తీసుకొచ్చి అక్కడ దీక్షా శిబిరంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈరోజు వాసుదేవరావు, రేపు ఇంకొకరు ఇలా ఇంతమందిని పొట్టన పెట్టుకుంటుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల ఆకలి బాధను గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు. డీఈవో కార్యాలయం వద్ద వాసుదేవరావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పరామర్శించి మాట్లాడారు. వాసుదేవరావు మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్య అని, వైసిపి ప్రభుత్వ వేధింపులు వల్లే ఉద్యోగులు మృతి చెందుతున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో తొలగించిన 19మంది ఉద్యోగులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వాసుదేవరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రవి కుమార్, డీఈవో వెంకట లక్ష్మమ్మ నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, సమగ్ర శిక్ష ఉద్యోగులతో చర్చలు జరిపారు. మృతుడు వాసుదేవరావు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, రూ.2 లక్షలు తక్షణ ఆర్థిక సహాయం, రూ.12 వేలు దహన ఖర్చులు నిమిత్తం ఇవ్వడానికి, సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించడానికి అధికారులు అంగీకరించారు. దీంతో మృతదేహాన్ని వాసుదేవరావు స్వగ్రామానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ, అచ్యుతకృష్ణ, వెంకటరావు, నూకేష్, నాగేశ్వరరావు, నాయుడు, సతీష్ సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా వాసుదేవరావుకు భార్య, ఏడేళ్ల కుమార్తె ఉన్నారు. వీరు దీక్షా శిబిరంలో మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు.



మృతదేహంతో శిబిరం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, బోరున విలపిస్తున్న వాసుదేవరావు భార్య, కుమార్తె

సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరసన

విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి సర్వ శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్. చైతన్య మాట్లాడుతూ, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన టెర్మినేషన్ ఉత్తర్వులను, షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.లక్ష్మి, ఐ.శ్రీరామమూర్తి, వినోద్, రాంబాబు, వసుమతి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపిపి భర్త నాగరాజు మృతి

ప్రజాశక్తి - బుచ్చియ్యపేట

ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి భర్త వైసీపీ నేత నాగరాజు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మండల వైసీపీలో తీవ్ర విషాదం నెలకొంది. నాగరాజు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో సహ వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు. సీతయ్యపేటలో నాగరాజు పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సందర్శించి నివాళులర్పించారు. ఎంపీపీ కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బుచ్చయ్యపేట మండలంలో మంచి నాయకుడిని కోల్పోయామని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. నాగరాజు అకాల మరణం వైసీపీకి తీరని లోటని పేర్కొన్నారు. చింతపాక నుండి ఎంపీటీసీగా గెలిచిన నాగరాజు భార్య నాగేశ్వరి దేవి అనూహ్య పరిణామాలు నేపథ్యంలో ఎంపీపీగా ఎన్నికయ్యారు. నాగరాజు వివాదరహితుడుగా, మృదుస్వభావిగా ఉంటూ అందరినీ కలుపుకుని పోయేవాడు. ఆయన అకాల మరణాన్ని పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. జడ్పిటిసి దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి నేతలు జోగా కొండబాబు, కే అచ్చం నాయుడు, నారాయణమూర్తి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ఉమ్మడి విశాఖ జిల్లా నుండి పార్టీలకతీతంగా యాదవ సంఘం నేతలు సీతయ్య పేట విచ్చేసి నివాళులర్పించారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



మునగపాకలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -మునగపాక

మండలంలోని పలు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు గల ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ వేగి వీరు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాలు పలువురిని అలరించాయి. హరిదాసుల, కొమ్మ దాసరి, వేషాలతో పాటుగా భోగి పండిళ్లు వేసి చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి శోభను ఉట్టిపడేలా చేశారు. రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించి చూపరులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

గాయత్రి స్కూల్‌లో..

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శ్రీగాయత్రి స్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో పండుగ వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు హరిదాసు, బుడబుక్కల వాడు, ఇతర వేషధారణలో అలరించినారు. భోగి మంట వేసి సంక్రాంతి పండుగ ప్రాసత్యాన్ని వివరించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించినారు. చివరిలో విద్యార్థులు గాలిపటాలను ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి రామ్ కుమార్, ప్రిన్సిపాల్ వై నగేష్, యాజమాన్య ప్రతినిధులు జివియన్ రమేష్, బి నరసింహమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు జి.సూర్యనారాయణరావు పాల్గొన్నారు.

శ్రీసాయి లత పాఠశాలలో..

ములగాడ : క్రాంతినగర్ శ్రీసాయిలత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ వై.రామ్‌లాల్ మిత్ర ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.శైలజ. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



హరిదాసుల వేషధారణలో గాయత్రి స్కూల్ చిన్నారులు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు

లిటిల్ కిడ్డీస్ ప్లేస్కూల్‌లో...

ఆరిలోవ : పాత డెయిరీఫారం, ఆదర్శనగర్ లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు అలరించారు. భోగి మంటలు, భోగి పళ్ళు, రంగవల్లులు, పాలు పొంగించడం, ఎడ్లబండి, పల్లె వాతావరణం, గొబ్బెమ్మలతో ఆటపాటలతో సంస్కృతి ప్రతిబింబించేలా పండుగ చేశారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ...

పిఎం పాలెం : మధురవాడ బక్కన్నపాలెం రోడ్‌లో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా హరిదాసు వేషాలు, చిడతలు వాయిస్తూ, పాటలు పాడి అందరినీ అలరించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి పాఠశాల ప్రిన్సిపల్ సందీప్, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, దుర్గ, దీప్తి పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న బాలికలు

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పరవాడ

రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో రియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్తి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ జివిఎన్.రావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రియా ఫౌండేషన్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం కబాడీ, ఖోఖో, ముగ్గులు, వాలీబాల్ తదితర క్రీడా పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. విజేతలకు బుధవారం సాయంత్రం బహుమతులు అందజేస్తామని రియా ఫౌండేషన్ చైర్మన్ ఎండి రాజు తెలిపారు.

అశోక్ బృందానికి స్వాగతం

ప్రజాశక్తి-అనకాపల్లి

రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయపతాకం ఎగరవేయాలని కోరుతూ నెల్లూరు జిల్లాకు చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజా సంక్షేమ శాఖ అధ్యక్షులు అశోక్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుండి తిరుపతి వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం పట్టణానికి చేరుకున్న సందర్భంగా టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అశోక్, సిహెచ్ మహేంద్ర, వంశీ జాషువా, పి మహేంద్ర బృందానికి తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు స్వాగతం పలికారు. అశోక్ ను పూలమాలవేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ అశోక్ ఆశయం సిద్ధించాలని, సైకో పాలన పోయి సైకిల్ రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాలాపు నాయుడు, డివివి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి-దేవరాపల్లి

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సచివాలయం 1 పరిధిలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. రెల్లిపేట, చిన్నంనాయుడు నగర్, కోరుప్రోలు కల్లాలు, ఎరుకల కాలనీ, మెయిన్ రోడ్, ఆంధ్ర వీధి, కుమ్మరి వీధి, కొల్లూరు వారి వీధి, ఏతపేట, హుక్కుంపేట ప్రాంతాల్లో పర్యటించారు. అంతకుముందు మండలంలోని నాగయ్యపేట గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ 20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ క్లినిక్, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, నాగయ్య పేట ఎస్సీ కాలనీ నుంచి చలమూరు కాలనీ మీదుగా కడకొండ పరిధి వరకు రూ.1.25 కోట్లతో నిర్మించిన తారురోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పిటిసి కర్రి సత్యం, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబురావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వరదపురెడ్డి లలితా నాయుడు, రొంగలి నారాయణమ్మ, కర్రి సూరి నాయుడు, కొల్లి ఈశ్వరరావు, వాలేటి నాగరాజు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

'టిడిపితోనే గ్రామాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి- కశింకోట

తెలుగుదేశం పార్టీ పాలనతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. కశింకోట మండలం, తేగాడ గ్రామంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ- బాబు షూరిటి కార్యక్రమంలో మంళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలకు, మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు సిద్దిరెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ బుద్ది రెడ్డి అప్పడు, మాజీ ఎంపీటీసీ బాబురావు, బుద్ది రెడ్డి గంగయ్య, బుద్ది రెడ్డి రామరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నేతకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని తేగాడ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొర్లి దత్తాత్రేయ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడటంతో ఆయనను మంగళవారం తేగాడలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందద సత్యనారాయణ పరామర్శించారు. అదే గ్రామంలో చందక బాలాజీ ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో కాలుకి గాయం కావడంతో ఆపరేషన్ చేయించుకోగా, ఆయన్ను కూడా పరామర్శించారు ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు సిదిరెడ్డి సూర్యనారాయణ , మాజీ ఎంపీటీసీ అద్దిపల్లి బాబురావు, కొత్తపల్లి మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య, ఎంపీటీసీ బుదిరెడ్డి నాయుడు, యువ నాయకులు బుదిరెడ్డి రామారావు, గ్రామ నాయకులు బోదేపు సురేష్, రావి చంటి, కొవ్వాడ తాతాజీ, మకాల రామారావు, ద్వారాపురెడ్డి గోవింద, కుండల బాబురావు, సుంకర రాజుబాబు, త్రినాథ్, ప్రసాద్ పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టంపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం 27/2023ను నిరసిస్తూ న్యాయవాదులు పాదయాత్ర చేపట్టి ఆర్డిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ నిరసనలో రైతు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించని చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. న్యాయ పరిధిని తగ్గించి ఎగ్జిక్యూటివ్ పరిధిలోకి భూ యజమాన నిర్ణయాన్ని అప్పగించడంతో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొన్నారు. కోర్టు నుంచి నాలుగు రోడ్ల వరకు పాదయాత్ర చేపట్టి మానవహారం నిర్వహించారు. అధ్యక్షులు శేఖర్ మంత్రి సాయి లక్ష్మణ్, సెక్రటరీ సూర శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బంధం వెంకటరమణ, సీనియర్ న్యాయవాదులు తిలక్, భవాని ప్రసాద్, కుమార్, హర శ్రీనివాస్, సుధాకర్, గంగాధర్, వై.సాయి, మోహన్, గోవిందు, సత్యనారాయణ, సముద్రిక లీల, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన పెద గంగవరం రైతుల నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి : తమకు రాజ్యాంగబద్ధంగా అన్ని హక్కులు ఉన్నా 1/70 చట్టం పేరుతో ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు వేధింపులు చేయడం సరికాదని, తక్షణమే వేధింపులు ఆపాలని అనంతగిరి మండలం పెదగంగవరం గ్రామానికి చెందిన రైతులు చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. వీరి దీక్షలు మండళవారం నాటికి మూడో రోజుకు చేరాయి. ట్రైబల్ వెల్ఫేర్ అధికారులారా.. మీకో దండం మా సమస్యలను పరిష్కరించాలని చేతులు జోడించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమకు దక్కాల్సిన హక్కులను ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు కాలరాస్తున్నారని శ్రీరామ రైతు సంక్షేమ సంఘం నాయకులు కొటాన వెంకటరమణ ఆరోపించారు.

నేడు డావిన్సీ స్కూల్లో స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తిమ్మరాజుపేట డావిన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం స్పోర్ట్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్కూల్ వ్యవస్థాపకులు కర్రి సుందరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు రకాలైన క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ బివి సత్యవతి, శ్రీవివేకానంద హాస్పిటల్ ఈఎన్‌టి వైద్యులు కే విష్ణుమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

జగనన్న సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారుగా 300 మంది వైద్య సేవలు అందుకున్నారు. సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు చేతుల మీదుగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈఓఆర్‌డి ధర్మారావు, ఈవో కే శ్రీనివాసరావు, డాక్టర్ సమీం, డాక్టర్ వాణి, స్పెషలిస్ట్ కంటి డాక్టర్, వైస్ ఎంపీపీ విల్లురి సూర్య కుమారి చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిఎం క్యాంపు ఆఫీసు ముట్టడి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాంబిల్లి

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్‌సి ప్రకటన చేయాలని కోరుతూ ఈ నెల 10న సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం చలో సిఎం క్యాంపు కార్యాలయం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా ఆదిగో డీఎస్సీ ఇదిగో డీఎస్సీ అంటూ నిరుద్యోగులను నయవంచన చేసిందని విమర్శించారు. జనవరి 9లోగా మెగా డీఎస్సీపై ప్రకటన చేయకుంటే సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి చేస్తామని డివైఎస్ఐ రాష్ట్ర కమిటీ హెచ్చరించినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో 1.88 లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం 1.69లక్షలు మాత్రమే ఉన్నారని, దాదాపు 18,520 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇవే కాక ఈనెల చివరి నాటికి మరో 5వేలమంది ఉపాధ్యాయులు రిటైర్డ్ అవుతున్నారని, కేంద్రం చెబుతున్న లెక్కలు ప్రకారం 40వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 117జీవో పేరుతో మరో 10వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని గుర్తు చేశారు. తెలుగు మిడియం తీసివేసి 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని చెప్పారు. 2వేల పాఠశాలలు మూసివేసిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 9వేలు ఉన్నాయన్నారు. అయినా ప్రభుత్వం ఖాళీలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు డ్రాపౌట్ కావడం లేదా ప్రైవేటు స్కూళ్లలో జాయిన్ అవ్వడం జరుగుతుందని చెప్పారు. దాదాపు రెండేళ్లలో 6లక్షల మంది విద్యార్థులు ఇలా డ్రాపౌట్ అయ్యారని గుర్తు చేశారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎం.పార్థు, జి.లోవరాజు, ఎం.రాజు, ఎస్.పవన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఆర్టీసీ స్థలం లీజు పేరుతో చెరువు కబ్జా

ఆక్రమణలు అడ్డుకోవాలని స్థానికుల డిమాండ్

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం పంచాయతీ పరిధిలో ఆర్టీసీ స్థలం లీజు పేరుతో చెరువును కబ్జా చేస్తున్నారు. చోడవరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం 1985లో పంచాయతీ పరిధిలో 82/2 సర్వే నెంబర్‌లో 3.71 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం సేకరించింది. ఈ స్థలంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి పోను ఎకరా 40 సెంట్లు ఖాళీ స్థలంలో ఇటీవల ఆర్టీసీ లీజుకు ఇచ్చింది. స్థల వైశాల్యం రెవెన్యూ అధికారులు అప్పగించకుండా లీజు పాటదారులు ఇష్టం వచ్చినట్లు ఆర్టీసి స్థలానికి ఆనుకొని ఉన్న గండి చెరువును పూడ్చుతున్నారు. ఇదే స్థలంలో పంచాయతీ గ్రామ కంఠం ఉందని పంచాయతీ వార్డు సభ్యులు సమావేశంలో తీర్మానించి అధికారులకు విన్నవించిన స్థల హద్దులు నిర్ణయించకుండా లీజు పాటదారులు యథేచ్ఛగా మట్టితో పూడ్చే పనులు చేపట్టారు. దీంతో చోడవరం పట్టణంలో ఉన్న పలువురు హద్దులు నిర్ణయించకుండా ఆక్రమణకు గురవుతుందని ఆరోపిస్తున్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని గ్రామకంఠం, చెరువు గర్భం ఎంతవరకు ఉందో తేల్చవలసిన ఆవశ్యకత ఉందని పలువురు చెబుతున్నారు. తక్షణమే అధికారులు చొరవ తీసుకునే ఆక్రమణదారులకు అడ్డుకట్ట వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


చెరువు స్థలాన్ని పూడ్చిన దృశ్యం

సిఎంకు మంచి బుద్ధి ప్రసాదించాలని
ఆంజనేయస్వామి విగ్రహానికి వినతి

ప్రజాశక్తి-కె.కోటపాడు

గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేస్తూ సర్పంచులకు నిధులు, విధులు లేకుండా చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ చౌడువాడలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహానికి మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు వినతిపత్రం అందించారు. కేంద్రం నుండి నేరుగా పంచాయతీలకు జమయ్యే 14, 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు సర్పంచ్ల తీర్మానం లేకుండా వేరువేరు ఖాతాలకు మళ్ళించి పంచాయతీల అభివృద్ధికి గండి కొట్టారని ఎరుకనాయుడు విమర్శించారు. దీనివలన గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ అటకెక్కిందన్నారు. ఇప్పటికైనా సర్పంచుల గోడు విని పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాలిబోయిన సంతోష్ యాదవ్, కుంచా అంజిబాబు, మారపురెడ్డి శివ, నాగులపల్లి మల్లు నాయుడు, గండేపల్లి మహేష్, చల్లపల్లి శ్రీను, రామారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయ విగ్రహానికి వినతి సమర్పిస్తున్న ఎరుకునాయుడు

సిఐగా పిన్నింటి రమణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం



సబ్బవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిన్నింటి రమణ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా పని చేసిన పి.రంగానాథం విజయనగరం సిఐ గా బదిలీపై వెళ్లారు. నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన రమణ మాట్లాడుతూ 2005లో సబ్బవరం ఎస్ఐగా విధులు నిర్వహించినట్లు చెప్పారు. 2011లో సిఐగా పదోన్నతి పొంది భీమిలి సిఐగా పనిచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం విజయవాడ ఎపి ట్రాన్స్ కో నుండి బదిలీపై సబ్బవరం సిఐగా వచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలో రానున్న సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామ దేవతల పండుగలకు, తీర్థాలకు ఎవరైనా కోడి పందేలు, బల్లాటలు, పేకాటలు ఆడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10న డిబేట్ పోటీలు

ప్రజాశక్తి -అనకాపల్లి

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'మై భారత్-వికసిత్ భారత్ ఏ 2047' అంశంపై ఈ నెల 10న డిబేట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకె జిల్లా యువజన సంక్షేమ అధికారి గొర్లి మహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు అనకాపల్లిలో శ్రీ గౌరీ గ్రంథాలయంలో జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు అనకాపల్లి జిల్లాకు చెందిన వారై ఉండాలని, 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు, నివాస, ఆధార్ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఔత్సాహకులు ఏడు నిమిషాలు ప్రసంగించాలన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి, ద్వితీయ బహుమతులు రూ.లక్ష, రూ. 50 వేలు, రూ.25 వేలు చొప్పున రెండు తృతీయ నగదు బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్ళు పూర్తైన 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న దక్పథం, ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, సుపరిపాలన లక్ష్యాలుగా 'వికసిత్ భారత్ ఏ 2047 - వాయిస్ ఆఫ్ యూత్' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. వివరాలకు 8074605109, 9247166511 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

విద్యా సంస్థలు సంక్రాంతి సెలవులు పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

సంక్రాంతి పండుగ సెలవుల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్ల ఈ నెల 9 నుండి 18 వరకు, ఇంటర్మీడియట్ కళాశాలలు 11 నుండి 17వ తేదీ వరకు సెలవులు పాటించాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంప్రదాయ పండగ సెలవులను కాదని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు యాజమాన్యాలు ప్రత్యేక తరగతుల నిర్వహణ పేరిట మానసికంగా వేధిస్తే ఆంధ్ర రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ఈ సెలవులు అమలు చేయడంలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, కమిషన్ సూచనలు పాటించని స్కూళ్ళ, కాలేజీల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫారసులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిక జారీచేశారు. వీటిపై ఫిర్యాదులుంటే apscpcr2018@gmail.com మెయిల్‌కు పంపిస్తే సత్వర చర్యలు చేపడతామని సీతారాం తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి అచ్యుతాపురం

శిశు ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలోనివిష్ణు డెంటల్ హాస్పిటల్ ఆవరణలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు దంత వైద్యులు ఎ.సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ ఆరోగ్య సమస్యలు, స్కిన్, ఎయిర్, డెంటల్, చెవి ముక్కు, స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల ఆరోగ్య సమస్యల ఉచితంగా పరీక్షింపబడతారని పేర్కొన్నారు. సంబంధిత వైద్య నిపుణులు శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షిస్తారని ఆయన తెలిపారు. శిబిరం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో ధర్మశ్రీ పర్యటన

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలంలో చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సుడిగాలి పర్యటన చేశారు. దొండపూడి, జెడ్.బెన్నవరం, కిత్తంపేట, పి.పొన్నవోలు, కెబిపి అగ్రహారం, మరుపాక, తట్టబంద తదితర గ్రామాలలో సచివాలయ, రైతు భరోసా, ఆరోగ్య సబ్ సెంటర్లుతో పాటు కిత్తం పేట లో తాగునీటి పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ, నియోజకవర్గంలో సుమారు 1800 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేసానని తెలిపారు. రావికమతం - తోట కూరపాలెం రహదారి నిర్మాణానికి సుమారు రూ 3 కోట్లు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిపి పైల రాజు, మండల ఎంపిటిసిల ఫోరమ్ నేత పూడి దేవ, మండల పార్టీ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, చోడవరం మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహం, పందల దేవ, మాజీ ఉప సర్పంచ్ కె. గున్నాజీ, వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు శీలం కళ్యాణ్ పాల్గొన్నారు.

కొత్తకోట:ఈ నెల 19న విజయవాడలో జరిగే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో జన్ భగీదరి కార్యక్రమాన్ని రావికమతం మండలంలో పలు గ్రామ పంచాయితీలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దొండపూడిలో చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొత్తకోట అంబేద్కర్ కాలనీ-1లో అంబేద్కర్ విగ్రహానికి



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ము డు సత్య దేవ్, ఎం పిటిసి పూడి దేవ, వైసీపీ జిల్లా ప్రధాన కార్య దర్శి తలారి ఆదిమూర్తి ఘనంగా నివా ళులు అర్పించారు. ఈ కార్యక్రమం వైసీపీ నాయకులు శీలం శంకరరావు, బెతా పాండు, శీలం కళ్యాణ్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మల్లేటి రాజు, బుల్లి బాబు, పూడి అర్జున్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ మంగళవారం పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన సుర్ల రవి 2021లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతని కుటుంబానికి 3లక్షల చెక్కును అందించారు. అలాగే నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి థెరిస్సా కాలనీకు చెందిన సరపాక దేవి కుమార్తె సరపాక రేవతి కాలిన తీవ్రమైన గాయాలతో చికిత్స పొందింది. బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు సీఎం జగన్, ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



విజయ్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే అధికారం

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు సిఎం అయితేనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. వైసిపి పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. . రాష్ట్రాభివృద్ధిని సిఎం జగన్ గాలి కొదిలేశారని విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి నుంచే టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రొట్టెలు, పాలు ఇస్తున్న వైద్యాధికారులు

పాలు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏజెన్సీ లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొంకసింగ్ భజన మండలి ఆధ్వర్యంలో 60 మంది గిరిజన, మైదాన ప్రాంత గర్భిణీలకు పాలు, రొట్టెలను వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, గాయత్రిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ లక్ష్మీపురం, పాతకృష్ణదేవి పేట సాయిభక్తులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పశుబీమాను వినియోగించుకోవాలి

సహాయ సంచాలకులు సింహాద్రప్పడు

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రప్పడు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పాడి పశువులు జీవాలు, ప్రమాదవశాత్తు అనారోగ్యంతో మరణించిన వాటికి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. పశు బీమా పథకాన్ని ప్రధానంగా పాడి రైతులు, గొర్రెలు మేకల రైతులు సద్వినియోగించుకోవాలన్నారు. ఒకటి నుంచి మూడు సంవత్సరాల వరకు పశు బీమా చేయించుకునే అవకాశం ఉన్నందున రైతులు ఆయా



గ్రామ సచివాలయాల్లో వివరాలు తెలుసుకొని బీమా చేయించుకోవాలన్నారు. ఒక్క కుటుంబానికి ఐదు పశువుల వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా గతంలో బీమా చేయించిన165 పశువులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉండగా, 35 పశువుల వరకు బీమా ఇచ్చామని ఆయన తెలిపారు. సకాలంలో రైతుల వాటా చెల్లించి భీమా సౌకర్యాన్ని సద్వినియోగించు కోవాలన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని యర కన్నపాలెం గ్రామానికి చెందిన 30 వైసిపి కుటుంబాలు మంగళవారం రుత్తల వాసు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా యరకన్నపాలెంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, నర్సీపట్నం రూరల్ నాయకులు బంగారు నాయుడు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:డ్వాక్రా సంఘాల అభివృద్ధికి వివోఏలు పాటుపడాలని శ్రీనిధి డిపిఎం కరుణానిధి అన్నారు. మంగళవారం ఏపీఎం రమణ కుమారి వివోఏలు డ్వాక్రా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసుకునేందుకు పిఓఏలు ప్రధాన భూమిక పోషించాలన్నారు. వచ్చే నెలలో ప్రభుత్వం అందజేసే వైయస్సార్ ఆసరాకు అర్హులను గుర్తించి వారికి సకాలంలో నిధులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపిఎం

10న టిడిపి బహిరంగ సభ

ప్రజాశక్తి -నక్కపల్లి:తునిలో ఈనెల 10వ తేదీన జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత కోరారు. నక్కపల్లిలో ఆమె స్వగృహంలో మంగళవారం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారని, ఇందులో భాగంగా ఈనెల 10న తునిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు కొప్పిశెట్టి వెంకటేష్, కురుందాసు నూకరాజు, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సిబ్బంది

ఎట్టకేలకు సర్వే రాళ్ల ప్లాంటేషన్ పనులు

ప్రజాశక్తి కోటవురట్ల:మండల కేంద్రంలో సుదీర్ఘకాలం నిర్వహించిన సమగ్ర సర్వే భూ పనుల అనంతరం ఎట్టకేలకు మంగళవారం నుండి స్టోన్ ప్లాంటేషన్ పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 8 నెలల పాటు నిర్వహించిన సమగ్ర సర్వేలో సుమారు 2300 ఖాతాలో 2223 ఎకరాల విస్తీర్ణాన్ని రెవెన్యూ సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. ఇందు నిమిత్తం 1098 వివిధ రకాల సర్వే రాళ్లు సిద్ధం చేసినట్లు రీ సర్వే డిటి నాని బాబు తెలిపారు. రైతుల సమక్షంలో సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్ రమ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికి సిఎం పెద్దపీట

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సీఎం జగన్ ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ముగించి నేటికీ ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 3648 కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రతి సమస్యను తెలుసుకొని వాటిని మేనిఫెస్టో రూపంలో తీసుకొచ్చి సంక్షేమ పాలన అందించేందుకు ఈ ప్రజాసంకల్పయాత్ర ఓ నాంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, వైసిపి టౌన్ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మధురవాడ: ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కెకె. రాజు, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పిల్లా సుజాత, పిల్లి సుజాత, పేడాడ రమణి కుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ, నడింపల్లి కృష్ణంరాజు, మాధవి వర్మ, అల్లంపల్లి రాజబాబు, కెవి. బాబా, బోని



నర్సీపట్నంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

శివరామకృష్ణ, సుశీల, పద్మావతి, కొట్యాడ సూర్య పాల్గొన్నారు.

భీమునిపట్నం : టి నగరపాలెం గ్రామ కూడలిలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు, సర్పంచ్ పొట్నూరు చాయా గౌతమి, ఎంపిటిసిలు పల్లా నీలిమ, చెల్లూరి నగేష్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, చంద్రశేఖర్, సన్యాసిరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సమన్వయకర్త కెకె రాజు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, వావిలపల్లి ప్రసాద్, కె.వి.యన్ శశికళ, కిరణ్‌రాజు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : లాసన్స్ బే కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంవివి సత్యనారాయణ ఆధ్వర్యాన ప్రజా సంకల్ప యాత్ర సంబరాలు నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

ఉపాధ్యాయుల అరెస్టులు అన్యాయం

ప్రజాశక్తి-యస్.రాయవరం:విజయవాడలో తలపెట్టిన 36 గంటల ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులను అక్రమ అరెస్టులు చేయడం దారుణమని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు యరమాటి కొండయ్య తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి కట్టా లోవరాజు పాల్గొన్నారు.

సిఐని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండల టిడిపి నాయకులు కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసిశారు. ఇటీవల కొత్తకోట సర్కిల్ సిఐగా బదిలీ పై వచ్చిన ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



సిఐతో టిడిపి నేతలు

ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, కోట గోవిందరావు, మడగల అర్జున, బంటు శ్రీను, గంజి మోదునాయుడు, కోట సత్తిబాబు, ఉగ్గిన శ్రీను, వై ఆచారి, గొర్లె శివ పాల్గొన్నారు.



శాంతి పావురాలను ఎగురవేస్తున్న అతిథులు

శ్రీ ప్రకాష్‌లో ఘనంగా వార్షికోత్సవం

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో 47వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవస్థాపకులు ఛైర్మన్, బి.ఎస్.సి.పి.ఎల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కృష్ణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కిమ్స్ మాజీ ఛైర్మన్ బొల్లినేని కృష్ణయ్య, గౌరవ అతిథులుగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కూరపాటి కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీ నారాయణ, సెకోబెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్డ్ మైనింగ్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ నాదెళ్ల వెంకట సుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ వై.వి.ఎస్ చలపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులందరూ విద్యార్థులు ఏర్పాటు చేసిన ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించారు. శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బొల్లినేని కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు ఇచ్చే నిజమైన సంపద చదువే అని తెలిపారు. గౌరవ అతిథి కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ, గురువులను విద్యార్థులు ఎప్పటికి మర్చిపోకూడదని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె. లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, మాతృబాష పట్ల పట్టు సాధిస్తేనే మిగతా బాషలపై పట్టు సాధించగలు గుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సి.హెచ్.వి.కె నరసింహారావు, శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటి ప్రెసిడెంట్ కంటిపూడి నరేంద్రబాబు, విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సి.హెచ్.విజయ్ ప్రకాష్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను ఇస్తున్న హెచ్‌ఎం, ఛైర్మన్

పథకాలను విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలి

స్కూల్ కమిటీ ఛైర్మన్ శేషుబాబు

ప్రజాశక్తి- రావికమతం : రావికమతం మండలంలో మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోడవరంకు చెందిన 4 జిఆర్ ట్రస్టు ఛైర్మన్ అన్నపూర్ణ, మేడివాడ స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడులు 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు వితరణగా అందించిన స్టడీ మెటీరియల్, రగ్గులు, ప్లాంక్‌లను ప్రధానోపాధ్యాయులు వి.రామారావు, స్కూల్ కమిటీ ఛైర్మన్ శేషుబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామారావు మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అనేక రాయితీలు, సదుపాయాలు, పరీక్షల్లో మార్కుల మినహాయింపులు, సబ్జెక్టుల మినహాయింపులు కల్పించడం జరుగుతుందన్నారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ శేషుబాబు మాట్లాడుతూ, దివ్యాంగులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. మరింతగా సేవాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపేట మండలం భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు దేముడు నాయుడు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జైల్‌భరో ఉద్రిక్తం

-విశాఖలో 300 మంది అరెస్టు



జైల్‌భరోకు వస్తున్న సంఘాల నేతలు, అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్న పోలీసులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన నిరంకుశ ఎస్మా చట్టాన్ని నిలిపేయాలని, మున్సిపల్ కార్మికులపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన మంగళవారం విశాఖలో జైల్ భరో నిర్వహించారు. ఎల్‌ఐసి కార్యాలయం సమీపంలోని బిఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళుతున్న ఆందోళనకారులను బాటా జంక్షన్ వద్ద వందలాది మంది పోలీసులు అడ్డుకొని సుమారు 300 మందిని అరెస్టు చేసి పోలీస్ బ్యారెక్స్‌లో నిర్బంధించారు.

అరెస్టులకు ముందు అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సభలో విశాఖ జిల్లా కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్ ఎం.మన్మధరావు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్మికులపై ఎస్మాను ప్రయోగించి తన నిరంకుశ పాలనను నిరూపించుకుందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఎస్మాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం అరెస్టులు చేయించి పోలీస్ స్టేషన్లో నిర్బంధిస్తోందని, కార్మికుల ప్రజాతంత్ర హక్కులను హరిస్తోందని, నిరంకుశ చట్టాలు, నిర్బంధాలు ఆపకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్బంధ పద్ధతులను విడనాడి అంగన్‌వాడీ, మునిసిపల్, సర్వ శిక్ష అభియాన్ కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జైల్ భరో కార్యక్రమం అరెస్ట్ అయిన వారిలో సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా నాయకులు పడాల రమణ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె.మల్లయ్య, ప్రజాపోరు నాయకులు దేవా, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.మణి, ఐద్వా జిల్లా నాయకులు బి.ఈశ్వరమ్మ, కె.ప్రభావతి, డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు కె.సంతోష్‌కుమార్, కె.శ్రావణ్‌కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఎం.చంటి, వై.అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, డి.అప్పలరాజు, ఎ.నరేంద్రకుమార్, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, జి.అప్పలరాజు, ఒ.అప్పారావు, పి.పైడిరాజు, ఎం.రాంబాబు, ఆర్.లక్ష్మణమూర్తి, ఉరుకూటి రాజు, టి.నూకరాజు, కె.అప్పలనాయుడు, కె.పెంటారావు, ఎఐటియుసి నాయకులు సిహెచ్.కాసుబాబు, శ్యామల తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థలు, అసంఘటిత రంగ కార్మికులతో పాటు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న పలు సంఘాల నేతలు

అనకాపల్లి: అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన మంగళవారం జైలుభరో నిర్వహించారు. ఇందులో భాగంగా అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలి నుండి దిశా పోలీస్ స్టేషన్ మీదగా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ అంగన్వాడీ సమ్మెపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. అంగన్వాడి వర్కర్లు 20 రోజులు ముందే సమ్మె నోటీస్ ఇచ్చి, 29 రోజులుగా సమ్మెలో ఉన్నారని, సమ్మె నోటీసు ఇచ్చినప్పుడు అత్యవసర విభాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి కనబడలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఆర్.శంకర్రావు జి.కోటేశ్వరరావు, వైఎన్.భద్రం, కోన మోహన్, నాయనబాబు, పి మాణిక్యం, శంకర్రావు, పివిఎన్. పరమేశ్వరరావు, శ్రీరామ్, ఉమామహేశ్వరరావు, రాజు, శివ, సంతోష్ పాల్గొన్నారు.

పరవాడ : అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనల్లో భాగంగా పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. వైస్ జగన్ ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు అప్పారావు కే.నాయుడు, జి శ్రీను, ఎన్ గురునాధరావు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్వాడీల ఆందోళనలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అంగన్వాడీల ఆందోళనలు 29వ మంగళవారం కూడా కొనసాగాయి. అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని మంగళవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం తాత్సారం చేయకుండా తక్షణమే అంగన్వాడీల సమస్య పరిష్కరించాలని ప్రభావతి డిమాండ్ చేశారు.

మునగపాక : మునగపాకలో అంగన్వాడీలునిరసన శిబిరాన్ని సిఐటియు నాయకులు పెంటకోట వెంకటరావు సందర్శించి తన మద్దతు తెలియజేశారు. అంగన్వాడీలు సరస్వతి, ఉమా, రేవతి పద్మ, మంగ తల్లి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల నిరసనలో యూనియన్ నాయకులు ప్రభ, సత్య, అమ్మాజీ, ఈశ్వరమ్మ, కనక, కుమారి పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలో అంగన్వాడీల రిలే దీక్షలు 29వ రోజు కొనసాగాయి. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, పుష్ప, జగదీశ్వరి, వి.సుభాషిణి, ఎం. కనకమ్మ, అరుణ కుమారిపాల్గొన్నారు.

అచ్యుతాపురం : డిమాండ్ల సాధనకు తలపెట్టిన అంగన్వాడీ కార్యకర్తల రిలే నిరాహార దీక్ష మంగళవారం కొనసాగింది. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణమ్మ, వరలక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో నిరసన శిబిరంలో అంగన్వాడీలు చేవుల్లో పువ్వులు పెట్టుకో మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, కోమలి, గౌరి, అంగన్వాడీలు పాల్గొన్నారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న మద్దతు తెలిపారు.

బుచ్చయ్యపేట : 29 రోజుల నుండి ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అంగన్వాడీలతు వరి గడ్డి తింటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆది వరలక్ష్మి, అమ్మాజి పాల్గొన్నారు.

చోడవరం : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని టిడిపి లీగల్ సెల్ న్యాయవాదులు మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో చోడవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి జి కృష్ణవేణి, న్యాయవాదులు పి ప్రకాష్‌రావు, చీపురుపల్లి సూర్యనారాయణ, కొల్లి శ్రీను, జి లక్ష్మీనారాయణ, నంబరు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

282 మంది అంగన్వాడీలకు నోటీసులు

కె.కోటపాడు : తక్షణమే విధుల్లో చేరాలని కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన 282 మంది న్వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్లు, ఆయాలకు నోటీసులు అందించినట్లు ఐసిడిఎస్ పిఓ మంగతాయారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వర్కర్‌కు వ్యక్తిగతంగా అందిస్తూనే గ్రామ సచివాలయాల వద్ద అంగన్వాడీ కేంద్రాల గోడలకు ఈ నోటీసులు అంటించడం జరిగిందన్నారు.

మాడుగుల : మండలంలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. బెదిరింపులకు భయపడేది లేదని మాడుగుల, చీడికాడ ప్రాజెక్ట్ అంగన్వాడి నాయకులు డి.పార్వతి తేల్చి చెప్పారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో కోలాటం ఆడుతూ నిరసన చేపట్టారు. అంగన్వాడి నాయకులు వి ధనలక్ష్మి, ఆర్.రామలక్ష్మి, డి.పార్వతిలు మాట్లాడుతూ, రేపు అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నామని తెలిపారు.

గొలుగొండ: సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించమని మండల అంగన్వాడీ యూనియన్ నాయకులు మంగతాయి, సత్య, చిన్నారి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సమ్మెను కొనసాగించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నర్సీపట్నంటౌన్: అంగన్వాడీలకు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగిచడం అప్రజాస్వామ్యం అన్నారు. నిర్బందాలతో ఉద్యమాలను అణచి వేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ప్రాజెక్టు నాయకులు వి సామ్రాజ్యం, మహలక్ష్మి, కృష్ణవేణి, సోబా, వరలక్ష్మి పాల్గొన్నారు.



గొలుగొండలో మాట్లాడుతున్న యూనియన్ నేతలు

తగరపువలస: అంగన్వాడీల సమ్మెలో భాగంగా మూడు రోజులుగా స్థానిక వై.జంక్షన్ వద్ద చేపట్టినరిలే నిరాహారదీక్షలకు ఐద్వా భీమిలి జోన్ కార్యదర్శి కె నాగరాణి మద్దతు తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు కె వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి కె పద్మావతి, భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి పాల్గొన్నారు

పెందుర్తి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా నిరాహార దీక్షలు నాల్గవరోజు కొనసాగాయి. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.బృందావతి మాట్లాడారు. ఆర్.రామలక్ష్మి, వరలక్ష్మి, బేగం,రేవతి, ఈశ్వరమ్మ, ముత్యాలమ్మ , జయ కుమారి చిన్నమ్మలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభించిన నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి మాట్లాడుతూ, అంగన్‌వాడీలపై ఎస్మా విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శోభారాణి, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు యూనియన్ నాయకులు పి.శ్యామలాదేవి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిఎన్‌టియుసి మద్దతు

టిఎన్‌టియుసి టెక్కలి నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన కార్మిక చైతన్య బస్సు యాత్ర విశాఖ నగరానికి చేరుకుంది. బస్సు యాత్రకు నాయకత్వం వహించిన టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. జాతీయ బిసి నాయకుడు కర్రి వేణుమాధవ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.